పేదలకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-చీరాల : చలి కాలంలో దుప్పట్లు పంపిణీ చేయడం వలన పేదలకు ఎంతో కొంత ఉపయోగం ఉంటుందని ఆర్థికంగా బలంగా ఉన్నవారు పేదలకు తమవంతు సహకారం అందించాలని సజ్జ చంద్రమౌళి, మల్లికంబా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సజ్జ లీలావతి అన్నారు. సోమవారం సజ్జ చంద్రమౌళి, మల్లికంబా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు బట్టా మోహనరావు మాట్లాడుతూ దేవంగపూరిలోని గంగ భ్రమరాంబ సమేత నాగలింగేశ్వర స్వామి దేవాలయంలో వందమంది పేదలకు దుప్పట్లు పంపిణీ అన్నదానం నిర్వహించడం ఆనందంగా ఉందని పేదల పట్ల ప్రతిఒక్కరు దయకలిగి వుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాసిక మోహనరావు, గుత్తి పరంజ్యోతి, రోహిణీ కుమార్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ప్రకాశం, బాపట్ల జిల్లాలు

ఘనంగా గ్యార్మి పండుగ

విశాలాంధ్ర-సంతమాగులూరు : మండలంలోని కొమ్మాలపాడు గ్రామంలో చివరి రోజు అత్యంత భక్తి శ్రద్ధలతో ఈ మాసంలో మహబూబ్ సుభాని గార్మి పండుగ జెండాలను విద్యుత్ దీపాల అలంకరణలతో మేళ తాళాలతో డీజే బాక్సులతో గ్రామం మొత్తం ఊరేగించి మహబూబ్ సుభాని దర్గా వద్ద జెండాలు పెట్టడం జరిగింది.

తుపాను ప్రభావం

- జిల్లా వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు
- పెరిగిన చలి తీవ్రత
- వేటకు వెళ్లవద్దని మత్స్యకారులకు ఆదేశాలు
- పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం

విశాలాంధ్ర టౌన్-ఒంగోలు : బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం గత రెండు రోజులగా జిల్లాపై స్పష్టంగా కన్పిస్తుంది. సోమవారం నుంచి జిల్లాలో పలు చోట్ల ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీనికి తోడు చలి తీవ్రత బాగా పెరిగింది. గడిచిన ఐదు సంవత్సరాలతో పోల్చుకుంటే నవంబర్‌లోనే ఇలాంటి చలి ఎప్పుడూ చూడలేదని జనం చెబుతున్నారు. మొత్తం మీద అల్పపీడన ప్రభావంతో జిల్లాలో మరో రెండు మూడు రోజుల పాటు ఒక మోస్తరు నుంచి బారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. ఇప్పటికే మత్స్యకారులను వేటకు వెళ్లవద్దంటూ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైతుల్లో మోదం కేదంలా ఉంది. కొన్ని పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తుండగా మరికొన్ని ప్రాంతాల్లో వరిసాగు, ఇతరత్రా పంటలు ముమ్మరంగా సాగు చేసుకునేందుకు ప్రస్తుతం కురిసే వర్షాలు ఉపయోగకరంగా ఉంటాయని భావిస్తున్నారు. సోమవారం తెల్లవారుజాము నుంచి చిరుజల్లులతో పాటు ఒక మోస్తరు వర్షం పడటంతో జిల్లా కేంద్రమైన ఒంగోలులో ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు, స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చిరు జల్లులు పడటంతో రోడ్డుపక్కన చిరు వ్యాపారాలు చేసుకునేవారు అనేక ఇబ్బందులు పడ్డారు. శివారు కాలనీలు కూడా బురదతో చిత్తడి చిత్తడిగా మారాయి. వాయుగుండం తుపానుగా మారే ప్రమాదం ఉన్న నేపథ్యంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా శివారు ప్రాంత కాలనీల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు. మరోపక్క మత్స్యకార గ్రామాల మండలాల్లో అధికారులు అలర్ట్ అయ్యారు. ఇప్పటికే మత్స్యకారులు వేటకు వెళ్లవద్ద ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో తుఫాన్ వలన బోట్లను, వలలను సురక్షిత ప్రాంతాలు (ఒడ్డు)కు చేర్చుకున్నారు. మరో రెండు రోజుల పాటు జిల్లాకు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు.

పెరిగిన చలి తీవ్రత

బంగాళాఖాతంలో వాయుగుండం ప్రబావంతో ఓ మోస్తరు వర్షంతో పాటు చలి తీవ్ర బాగా పెరిగింది. నవంబర్ నెలలో ఇలాంటి చలి ఎప్పుడూ లేదని ప్రజలు చెబుతున్నారు. గత వారం రోజుల నుంచే జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు పూర్తిగా మారాయి. దీనికి తోడు చలి కూడా ఎక్కువగా ఉండటంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. వాయుగుండం ప్రభావం వలన చలి తీవ్రత మరింత పెరిగింది. దీంతో హాస్టల్ విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా శివారు ప్రాంతాల కాలనీల్లో ఉండే పేదలు గిరిజనులు, ట్రైబల్స్, ఇతరత్రా వర్గాలకు చెందిన పేదలు చలి తీవ్రతకు తట్టుకోలేక పోతున్నారు.

మరో రెండు రోజులు భారీ వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫానుగా మారుతున్న నేపథ్యంలో జిల్లాకు మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులు వెల్లడిస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంటలకు నష్టం లేకపోయినా, నేడు, రేపు భారీ వర్షాలు కురిస్తే కంది, మిర్చి, పత్తి, ఇతరత్రా పంటలకు భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయండి

కలెక్టర్‌కు సీపీఐ నేతల వినతి

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాసులు, సోమవారం యర్రగొండ పాలెంలో జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పశ్చిమ ప్రకాశం ఆశాజ్యోతి అయిన పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. ప్రాజెక్టుకు అవసరమైన నిధులను వెంటనే కేటాయించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. ముంపు గ్రామాల ప్రజలకు వెంటనే నష్టపరిహారం చెల్లిం చాలని ఆయన డిమాండ్ చేశారు. పుల్లలచెరువు మండలంలోని మంజూరు చేసిన టీ5 కాల్వకు వెంటనే నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని కోరారు. యర్రగొండపాలెం మండలంలోని గంజివారిపల్లె సమీపంలో కోటకట్ల చెరువు ఓ.సే లేదన్నారు. అటవీ శాఖ అనుమతులు తీసుకొని రాళ్ల వాగు పైన ఐదు చెక్కుడాములను నిర్మించాలని ఆయన తెలిపారు. ప్రభుత్వము పేదలకు పక్కా గృహాలకు కేటాయించిన రూ.1.80 లక్షలు కేటాయించిన అన్నారు పెరిగిన భవ నిర్మాణమునకు అవసరమైన వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి అన్నారు. మొదట్లో ప్రభుత్వం వారే గృహాలు నిర్మాణం చేయిస్తామని వాగ్దానం చేశారన్నారు. ఆయన వెంట సీపీఐ సీనియర్ నాయకులు టిసిఎస్ చెన్నయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.వి.కృష్ణ గౌడ్, సీపీఐ మండల కార్యదర్శి గురువయ్య, సీపీఐ నాయకులు నక్కా తిరుపతయ్యలు ఉన్నారు.

23న సామూహిక రుద్రపూజ

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని రామకృష్ణ మఠం నందు 23వ తేదీ బుధవారం ఉదయం 6.30 నుంచి 8గంటల వరకు సామూహిక రుద్రపూజ జరుగుతుందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బియస్ నారాయణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రుద్రపూజ అనంతరం అల్పాహారం ఏర్పాటు చేస్తున్నామన్నారు. సామూహిక రుద్ర పూజ నిర్వహించడానికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు సద్గురువులు శ్రీ శ్రీ రవిశంకర్ గురూజీ శిష్యులు సాత్వి ప్రసీద, వేద పండితులు అర్జున్ శర్మ, కృష్ణశర్మ ఇద్దరు పాల్గొని సామూహిక రుద్రపూజ నిర్వహిస్తారని తెలిపారు. సామూహిక రుద్ర పూజలో పాల్గొనేవారు సాంప్రదాయ దుస్తులు ధరించి కుటుంబ సమేతంగా పాల్గొనాలని, అందరూ ఆహ్వానితులే అన్నారు. శివ పరమాత్మ కృపకు పాత్రులు కావాలని కోరారు. కావున ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున వచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా ఆయన కోరారు.

గాయం జాహ్నవి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : హనుమంతుని పాడు మండలం ఎంపీపీ గాయం సావిత్రి మరియు ఒంగోలు ఏడీఈ గాయం వినయ్ కుమార్‌రెడ్డి వారి కుమార్తె గాయం జాహ్నవి జన్మదిన వేడుకలు సందర్భంగా సోమవారం ఒంగోలు పట్టణంలోనే బొమ్మరిల్లు ఆర్ఫండ్స్‌లో అనాధా పిల్లలకు ఉదయం టిఫిన్ ఏర్పాటు చేయడం జరిగింది. అనంతరం అక్కడే ఇంటర్ సెకండియర్ చదువుకుంటున్న హనుమంతునిపాడు గ్రామానికి చెందిన చెన్నలతకు స్కూల్ ఫీజు అయ్యే ఖర్చుల నిమిత్తం హనుమంతునిపాడు మండలం ఎంపీపీ గాయం సావిత్రి, వారి కుమార్తె గాయం జాహ్నవి చేతులు మీదుగా చెన్నలతకు నగదు అందజేశారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

టీజేఆర్ సుధాకర్ బాబు

విశాలాంధ్ర చీమకుర్తి : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని స్థానిక ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు అన్నారు. సోమవారం చీమకుర్తి పట్టణంలోని 6 వ వార్డు నందు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల పుస్తకాలను జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బుజేపల్లి శివప్రసాద్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొని పంపిణీ చేశారు. సీఎం జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు ఎన్ని రాద్ధాంతాలు చేసినా జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను మన ప్రభుత్వం కొనసాగిస్తూనే ఉంటుందని ప్రజలకు వివరించారు. గడపగడపకు మన ప్రభుత్వం రాష్ట్రంలో ఎక్కడ జరిగిన ప్రజలందరూ ఆనందంతో పాల్గొంటున్నారని ముఖ్యంగా మహిళలు హారతులు పడుతూ స్వాగతం పలుకుతున్నారని సీఎం జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు ఎందుకు నిదర్శనమని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే బుచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చుతున్నారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మన రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యుడు వేమా శ్రీనివాసరావు, 6వ వార్డు కౌన్సిలర్ గోపవరపు రాజ్యలక్ష్మి పూర్ణచంద్రరావు, చీమకుర్తి పట్టణ వైసీపీ అధ్యక్షుడు క్రిష్టిపాటి శేఖర్‌రెడ్డి వైసీపీ మండల మాజీ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, చేనేత సొసైటీ డైరెక్టర్ సోమ యానాదిశెట్టి మున్సిపల్ కోఆప్షన్ కో ఆప్షన్ నెంబర్ ఖాదర్ భాషా పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అన్నా

విశాలాంధ్ర-బేస్తవారిపేట : కంభం ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సోమవారం గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపి చేగిరెడ్డి తులసమ్మ, వైద్యాధికారులు డాక్టర్ సూరిబాబు, డాక్టర్ శివనాయక్, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మత్స్యకారులను ఆదుకునేందుకు చర్యలు

మంత్రి ఆదిమూలపు సురేష్

మత్స్యకారులకు పరికరాలు పంపిణీ చేస్తున్న మంత్రి సురేష్, కలెక్టర్ దినేష్ కుమార్

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : మత్స్యకారులను ఆదుకోవడానికి అవసరమైన అన్ని చర్యలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చెప్పారు. వై.సి.పి ప్రభుత్వం వచ్చాక గతంలో ఉన్న రాయితీలను పెంచడంతో పాటు మత్స్యకారులకు అండగా ఉండేలా సరికొత్త పథకాలను ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. దీనికి అనుబంధంగా యర్రగొండపాలెం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమంలో మంత్రి సురేష్‌తో పాటు కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమం, వారికి మెరుగైన జీవనోపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు అందించే ఆర్థిక సహాయాన్ని రూ.4వేల నుంచి పదివేలకు ముఖ్యమంత్రి పెంచారని ఆయన చెప్పారు. చేపల వేట సమయంలో మత్స్యకారులు ప్రాణాలు కోల్పోతే ఇచ్చే పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి పది లక్షలకు పెంచారని, పడవలకు డీజిల్ ఆయిల్ పై ఇస్తున్న సబ్సిడీని రూ.6 నుంచి రూ.9కి పెంచారని వివరించారు. పది ఎకరాల లోపు ఉన్న ఆక్వా రైతులకు ఇస్తున్న విద్యుత్ యూనిట్ రేటును రూ.2 నుంచి రూ.1.50లకు తగ్గించారని, మత్స్యకారులకు 40 శాతం సబ్సిడీతో బోట్లు, వలలు, ఇంజిన్ అందిస్తున్నామని తెలిపారు. ఈ విధమైన రాయితీలు కల్పించడంతో పాటు దేశీయ చేపల మార్కెటింగ్ ను ప్రోత్సహించడానికి 'ఫిష్ ఆంధ్ర బ్రాండ్' పేరుతో ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. సముద్ర మత్స్యకారుల వలసలను అరికట్టడానికి కొత్తపట్నంలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఫిషింగ్ హార్బర్ ను నిర్మించడానికి చర్యలు వేగవంతం చేస్తున్నట్లు ప్రకటించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఆహార వినియోగంలో 27 శాతం ఆక్వా ఉత్పత్తులు ఉన్నందున ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆక్వా కల్చర్ అభివృద్ధి అథారిటీ చట్టం ద్వారా మత్స్యకారుల అన్ని అవసరాలను అధికార యంత్రాంగం తీరుస్తున్నట్లు చెప్పారు. తీర ప్రాంతంలో పెట్రోలింగ్ బోట్లు కూడా త్వరలోనే అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం అర్హులైన ఇద్దరు మత్స్యకారులకు 40 శాతం సబ్సిడీపై ఇంజను, వలలను మంత్రి, కలెక్టర్ అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి నారాయణరెడ్డి, రాష్ట్ర ఆప్కాబ్ న్యాయ సమన్వయాధికారి సైదా, రాష్ట్ర పట్టపు సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు వాయిల మోహన్ రావు, మత్స్యకార జిల్లా సొసైటీ అధ్యక్షులు వాయిల శ్రీనివాసరావు, సముద్ర తీర మత్స్యకార యూనియన్ అధ్యక్షులు గొల్లపోతు నాగార్జున, జాతీయ మత్స్యకారుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు గొల్లపోతు గోవర్ధన్ రావు పాల్గొన్నారు.

నేడు రైల్వే పనుల పరిశీలన

రానున్న సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్

విశాలాంధ్ర-తర్లుపాడు : మండల కేంద్రమైన తర్లుపాడులోని స్థానిక రైల్వే స్టేషన్‌లో ఇటీవల పూర్తిచేసిన డబ్లింగ్ పనుల పర్యవేక్షణ నిమిత్తం, స్టేషన్‌నందలి మౌలిక వసతుల పరిశీలన నిమిత్తం మంగళవారం సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తర్లుపాడు రైల్వే స్టేషన్‌కు వస్తున్నారని ప్రజా సంఘ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తర్లుపాడు రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలలోని గ్రామాల ప్రజలు రైల్వే స్టేషన్ నందలి ఏవైనా వసతుల కొరకు గానీ, రైల్వేపరమైన సమస్యలు ఏ వైనా ఉన్నచో అర్జీ మూలకంగా వ్రాసి జనరల్ మేనేజర్‌కు అందజేయవచ్చునన్నారు. తర్లుపాడు నుండి మార్కాపురం రోడ్డు వెళ్లే దారిలో గల రైల్వే గేటు తరచుగా వేయటం వలన దాదాపుగా 15 నిమిషాల నుంచి 30 నిమిషాల వరకు రాకపోకలకు అంతరాయం కలగడమే కాకుండా, ట్రాఫిక్సమస్యలు ఏర్పడుతున్నాయి. ప్రజలు ఎవరికైనా దురదృష్టవశాత్తు ఏదైనా ప్రమాదం సంభవించినా, తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తినా, అత్యవసర చికిత్స కొరకు మార్కాపురం తీసుకు వెళ్ళవలసి ఉన్నది. అలాంటి సమయంలో రైల్వే స్టేషన్‌లోని స్టేషన్ మాస్టర్ వద్ద ఈ గేట్ లాక్ సిస్టం ఉండుటవలన, కనీసం అంబులెన్స్ వెళ్లే సదుపాయం కూడా లేకపోవడంతో, గతంలో పలువురికి సకాలంలో వైద్యం అందక మరణించిన సంఘటనలు ఉన్నాయి. విధులకు వెళ్లే ఉద్యోగులకు, పాఠశాలలకు, కాలేజీలకు వెళ్లే స్టూడెంట్స్ కి సరైన సమయానికి వెళ్లేందుకు ఈ గేటు ఇబ్బందికరంగా మారడంతో పలు సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం జరగవలసి ఉంది. ఈ ఫ్లైఓవర్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 50శాతం నిధులు, కేంద్ర ప్రభుత్వం 50 శాతం నిధులు కేటాయించ వలసి ఉంది. ఈ సమస్యను స్థానిక శాసనసభ్యులు కుందురు నాగార్జున రెడ్డి దృష్టికి స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, ప్రజలు, తీసుకువెళ్లి వారి ద్వారా తర్లుపాడు రైల్వే స్టేషన్కు విచ్చేయుచున్న జనరల్ మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లిన ఎడల వారు ఈ ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుండి 50శాతం నిధులు కేటాయిస్తారని రైల్వే శాఖ అధికారులు గతంలో తెలియపరిచారు. అంతేగాక తర్లుపాడు రైల్వే స్టేషన్ గుండా ప్రయాణించే రైళ్లు ఆగకపోవడంతో, ప్రయాణికులు ఎన్నో ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. అలాగే రైల్వే స్టేషన్ నందు రిజర్వేషన్ కౌంటర్ ప్రయాణికుల సౌకర్యార్థం కావలసి ఉన్నది. అలాగే రైల్వే స్టేషన్ పరిధిలోని సాఫ్ట్వేర్ ఇంజనీర్లు కొందరు చెన్నైలో విధులు నిర్వహిస్తున్నారు.

ఇక్కడి ప్రజలకు తీవ్ర అనారోగ్య పరిస్థితులు ఎదురైతే మెరుగైన చికిత్స కొరకు చెన్నైలోని ప్రముఖ వైద్యశా లలకు వెళ్లేందుకు వీలుగా గుంటూరు నుండి వయా" నంద్యాల, ఎర్రగుంట్ల, తిరుపతి మీదుగా చెన్నైకి వెళ్లేందుకు రైలు సౌకర్యం అవసరం ఉంది. ఇలాంటి పలు సమస్యలను దృష్టిలో పెట్టుకొని మరియు ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే నవంబర్ 22వ తేదీ తర్లుపాడు రైల్వే స్టేషన్కు విచ్చేయుచున్న జనరల్ మేనేజర్ దృష్టికి స్థానిక ప్రజా ప్రతినిధులను, ప్రతి గ్రామంలోని ప్రజలు సంప్రదించి, అందరూ కలిసికట్టుగా విచ్చేసి వినతి పత్రం సమర్పించ వలసిందిగా పలువురు కోరుతున్నారు. జనరల్ మేనేజర్ దగ్గరికి కేవలం ఐదు, ఆరు మందిని మాత్రమే పంపుటకు వీలున్నదని రైల్వే శాఖ అధికారులు గతంలో తెలియజేశారు. రైల్వే జనరల్ మేనేజర్ పర్యటన అంటే కొన్ని సంవత్సరాలకు ఒకసారి రావడం జరుగుతుంది కాబట్టి రైల్వే స్టేషన్ పరిధిలోని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు అందరూ కలిసి వారి వారి సమస్యలను వినతి పత్రం ద్వారా సమర్పించాలని కోరుతున్నారు.

ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలి

మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న దృశ్యం

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : ప్రజా సమస్యలను క్షేత్ర స్థాయిలోనే పరిష్కరించేలా అధికార యంత్రాంగం స్పందన కార్యక్రమాలను నిర్వహిస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చెప్పారు. సోమవారం యర్రగొండపాలెం నియోజక వర్గ స్థాయి స్పందన కార్యక్రమాన్ని స్థానిక అంబేద్కర్ భవన్లో మంత్రి సమక్షంలో నిర్వహించారు. కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ కూడా ఇందులో పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ స్పందన కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. ప్రజలు ఇచ్చే అర్జీలు పరిష్కారమ వుతున్న తీరును ప్రత్యేకంగా ముఖ్యమంత్రి సమీక్షిస్తున్నారని ఆయన తెలిపారు. సమస్యలను సత్వరమే పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు వివక్షకు తావులేకుండా అందేలా చూస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వచ్చిన అర్జీలు సకాలంలో, సహేతుకంగా పరిష్కరించాలని అధికార యంత్రాంగాన్ని ఆయన ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం ఒంగోలు కలెక్టరేట్లో నిర్వహించే జిల్లా స్థాయి స్పందన కార్యక్రమానికి దూర ప్రాంతాల నుంచి ప్రజలు రావడం గమనించామని చెప్పారు. అలా కాకుండా అధికార యంత్రాంగమే ప్రజల వద్దకు వెళ్లేలా నియోజకవర్గ స్థాయిలో జిల్లా అధికారుల సమక్షంలో స్పందన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ స్పందన కార్యక్రమంలో మొత్తం 516 అర్జీలు వచ్చాయని ప్రకటించారు. సత్వరమే వీటిని పరిష్కరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. క్షేత్ర స్థాయి అధికారులు అర్జీలను పరిస్కరిస్తున్న తీరును పైఅధికారులు పర్యవేక్షిస్తూ ఉండాలని ఆయన స్పష్టం చేశారు. అర్జీలను పరిష్కరించి ఆ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో డీ.ఆర్.వో. బి చినఓబులేసు, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సరళా వందనం, గ్లోరియా, నారదముని, ఐ.టీ.డీ.ఏ. పీవో రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : రెవెన్యూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. ఆయా అంశాలపై సోమవారం స్థానిక శ్రీ శ్రీనివాస కళ్యాణ మండపంలో డివిజన్లోని తహసిల్దార్లు, వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం జరిగింది. స్పందన, మీ - సేవ/గ్రామ, వార్డు సచివాలయ సేవలు, మ్యుటేషన్లు, 22(ఏ), కోర్టులలో చుక్కల భూముల సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు, రీ సర్వే, ఇళ్ల పట్టాల పంపిణీ, ప్రభుత్వ భూముల అసైన్మెంట్, తదితర అంశాలపై మండలాల వారీగా ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూముల రీ సర్వే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. రీ సర్వే ప్రక్రియలో వేగం పెంచాలని ఆదేశించారు. ఇది కేవలం రీసర్వే మాత్రమే కాదని రీ సెటిల్మెంట్ కూడా అని వివరించారు. కొందరు వీఆర్ఓలు. పలు సర్వీసులు నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయక పోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, ఇతర సమస్యలు పరిష్కారమవుతున్న తీరును రాష్ట్రస్థాయిలో ప్రభుత్వం పరిశీలిస్తూ ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీ.ఆర్.వో. బి.చిన ఓబులేశు, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్ పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై దృష్టి కేంద్రీకరిస్తాం

– జిల్లా ఎస్పీ మల్లిక గర్గ్

బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ

కారుణ్య నియామకపత్రాలు అందజేస్తున్న ఎస్పీ మల్లికగర్గ్

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రజా ఫిర్యాదులను పరిష్కరించుటకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మల్లికగర్గ్ పోలీసు స్పందన కార్యక్రమమును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల వ్రాతపూర్వక అర్జీలను ఎస్పీ స్వయంగా స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడి వారి ఫిర్యాదుల గురించి కూలంకుషంగా అడిగి తెలుసుకుని, వాటిని చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా కల్పించారు.అందిన ప్రతి ఫిర్యాదుపై ఎస్పీ సంబందిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి స్పందన పిటిషన్ల పట్ల ఎక్కువ దృష్టి కేంద్రీకరించి ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం అందించేలా కృషి చెయ్యాలని ఆదేశించారు. ఆయా స్పందన ఫిర్యాదులపై తీసు కున్న చర్యలపై కూడా ఎప్పటికప్పుడు నివేదికలు పంపించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు.

ఇద్దరికి మహిళా పోలీసులుగా కారుణ్య నియామకం

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో పని చేస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులో ఇద్దరికి మహిళా పోలీసులుగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మల్లికగర్గ్ నియామక పత్రాలు అందజేశారు. ఏపీఎస్ఆర్టీసీలో కండక్టర్ గా విధులు నిర్వహిస్తూ 2018లో మరణించిన ఎ. వెంకట్ నారాయణ సతీమణి పద్మావతికి పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామ సచివాలయంలో, అలాగే కండక్టర్ గా 2013 లో మరణించిన ఈ శివరామకృష్ణ కుమార్తె భారతికి ఒంగోలులోని కమ్మపాలెం సచివాలయంలో మహిళా పోలీసులుగా కారుణ్య నియామకాలు కింద పోస్టింగ్లు కేటాయించడం జరిగింది. ఎస్పీ వారికి మహిళా పోలీస్ ఉద్యోగ విధివిధానాల గురించి అవగాహన కల్పించి, గ్రామా/వార్డ్ సచివాలయాల పరిధిలో జరిగే శాంతి భద్రతల పరిరక్షణ, నేరాలు నియంత్రణ, అసాంఘిక/చట్ట వ్యతిరేక కార్య క్రమాలు, ఇతర విషయాలకు సంబంధించి సమా చారం సేకరణలో ప్రముఖ పాత్ర పోషించాలని, మెరుగైన రీతిలో ప్రజలకు సేవలను కొనసాగించడానికి అంకితభావంతో కష్టపడి పని చేయాలని తెలిపారు.

బీసీల కులగణనను వెంటనే చేపట్టాలి

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

విశాలాంధ్ర-ఒంగోలు : ఆధిపత్య కులాలకు విద్య,ఉద్యోగ రంగాల్లో ఇడబ్ల్యుఎస్ 10శాతం రిజర్వేషన్‌లను వ్యతిరేకిస్తూ బీసీల కుల జనగణన వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ బిసి సంక్షేం సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. నిరసన కార్యక్రమం ప్రకాశం జిల్లా కలెక్టర్ కార్యాలయం దగ్గర జిల్లా అధ్యక్షులు బందారు సోమరాజు అధ్యక్షతన జరిగింది. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించి, ర్యాలీగా బయలుదేరి కలెక్టర్ కార్యాలయం దగ్గర మీడియా పాయింట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. జిల్లా అధ్యక్షులు బందారు సోమరాజు మాట్లా డుతూ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా బీసీలకు అన్యాయం జరిగిందని, దశాబ్ద కాలంగా బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని పట్టించుకోకుండా 10 శాతం అగ్రవర్ణాలకు రిజర్వేషన్ కల్పిస్తూ పార్లమెంట్లో గంటల వ్యవధిలో బిల్ పాసుచేయటం జరిగినదని, దీనిని నిరసిస్తూ బీసీ వర్గాలు సుప్రీంకోర్టును ఆశ్రయిస్తే అక్కడ కూడా త్రిసభ్య ధర్మాసం 10శాతం రిజర్వేషన్‌ను సమర్థిస్తూ తీర్పుని ఇవ్వడం ఎంతవరకు సమంజసం? అని ప్రశ్నించారు. ఈ తీర్పును వెనక్కి తీసుకొని, బీసీలకు న్యాయం చేయాలని, లేని పక్షంలో రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్ రావు ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు గోసుగుంట బ్రహ్మానంద శర్మ,జిల్లా ప్రధాన కార్యదర్శి బలగాని ఆంజనేయులు, జిల్లా అధికారప్రతినిధి దేవరంపాటి శ్రీదేవి,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్షేక్ అజీజ్, జిల్లా ఉపాధ్యక్షులు పుల్లయ్య, జిల్లా కార్యదర్శి శేషమ్మ, బీసీ నాయకులు ధరణికోట లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పంచాయతీ జిల్లా నోడల్ అధికారిపై వేధింపులు

– కలెక్టర్‌కు ఫిర్యాదు

విశాలాంధ్ర – బాపట్ల : జిల్లా పంచాయతీ కార్యాలయంలో నోడల్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న బి.రాజ్యలక్ష్మిని అదే కార్యా లయంలో పనిచేస్తున్న రాయుడు, వినోద్‌లు సీసీలు అని చెప్పుకుంటూ పలు విధాలుగా వేధింపులకు గురిచేస్తున్నారని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. కార్యాలయంకు పైన ఉన్న గదిలో నాకు విధులు కేటాయించి ఆ గదిని వినోద్ అనే వ్యక్తి రాత్రులు వాడుతూ అక్కడే లోదుస్తులు ఉంచుతున్నారని అటువంటి గదిలో నన్ను ఉండమంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 60 ఏళ్ళ వయస్సు ఉన్న నన్ను నా విధుల నిర్వహణలో ఆటకం కల్గిస్తు ఇబ్బందిపెడుతున్నారని తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి సమక్షంలో అన్నీ జరుగు తున్నా ఖండించటం లేదని తెలిపారు. కార్యాలయంలో రిపోర్టులు తీసుకునేందుకు వినోద్‌కు రూ.500 ఇస్తేనే రిపోర్టులు తీసి ఇస్తున్నారని తెలిపారు. డీపీవో దృష్టికి తీసుకుని వెళ్లిన ఏం చేయకుండా నన్నే దండిస్తు న్నారని నేను ఉద్యోగం ఏలా చేయాలంటూ విలపించారు. కలెక్టర్‌కు ఫిర్యాదు ఇచ్చేందుకు వెళ్తున్న నన్ను రాయుడు వచ్చి నాపై ఫిర్యాదు ఇస్తావా నేను లోకల్ నీ ఇష్టం అంటూ బెదిరిం చాడని తెలిపారు. విధులకు ఆటంకం కలగకుండా చూడాలని రాజ్యలక్ష్మి కోరారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

విశాలాంధ్ర-మార్టూరు : మార్టూరు స్పోర్ట్స్ కల్చరర్స్ ట్రస్ట్ ఆధీనంలో ఆదివారం నిర్వహించిన షటిల్ టోర్నమెంట్ కెసిపిసి ఇండోర్ స్టేడియంలో ప్రకాశం బాపట్ల పల్నాడు గుంటూరు జిల్లాల స్థాయి షటిల్ టోర్నమెంట్ నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి జితేంద్ర, భాష నరసరావుపేట, రెండో బహుమతి ఖాదర్ మస్తాన్, విజయ సాయిరెడ్డి మార్టూరు, మూడో బహుమతి రహమాన్, తేజ పొదిలి, నాలుగో బహుమతి సూర్య, మదన్ చీరాల, మెడలిస్ట్ ఈవెంట్ మ్యాచ్లో మొదటి బహుమతి సైదా అండ్ అనుసరి నరసరావుపేట రెండో బహుమతి జితేంద్ర అండ్ విజయ్ సాయిరెడ్డి, గుంటూరు లోకల్ టోర్నమెంట్ విజేతలు మొదటి బహుమతి కుంభ అంజి అండ్ లింకన్ రెండో బహుమతి సుబ్బారావు అండ్ సేమ్ మూడో బహుమతి నాలుగో బహుమతి ఫారుక్ అండ్ జాకబ్ విజేతలుగా ప్రకటించడం జరిగినది విజేతల గాను మార్టూరు స్పోర్ట్స్ కల్చరల్ టెస్ట్ అయిన సభ సభ్యులు అయినా దొడ్డ రమేష్ రాజా రమణారెడ్డి షేక్ ఫరూక్ చెరుకూరి గోపి మరియు రవి మాస్టారు కోటి మాస్టారు బహుమతులను అందించడం జరిగింది.

కార్తిక మాస పూజలు

విశాలాంధ్ర-యద్దనపూడి : కార్తీక మాసం చివరి సోమవారంను పురస్కరించుకొని మండలంలోని శివాలయాలు భక్తులతో పోటెత్తినవి. వేకువ జాము నుంచి భక్తులు ఆలయాలు చేరుకొని కార్తీకదీపం వెలిగించి స్వామివారికి విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు, నిర్వహించారు. మహిళా భక్తులు ఉదయం నుంచి ఉపవాసం ఉండి, రాత్రి నక్షత్ర దర్శనం అనంతరం ఉపవాస దీక్ష ముగించారు. పూనూరులో త్రిపురాంతక స్వామి పోలూరులో చెను మల్లికార్జున స్వామి గన్నవరంలో కాశీ విశ్వేశ్వర యద్దనపూడిలో రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు స్వామివారికి వివిధ సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను సేకరించారు.

కార్తీక సోమవారం ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-టంగుటూరు : టంగుటూరు మండలంలోని జమ్మలపాలెం గ్రామంలో కార్తీక సోమవారం చివరి రోజు కావడంతో జమ్మలపాలెంలో ఉన్న 116 శివలింగాల పంచముఖ విగ్రహాన్ని టంగుటూరు మండలంలోని చుట్టుపక్కల ఉన్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించుకొని పంచముఖ శివలింగాల విగ్రహాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు పులిహార పొంగల్ ఆలయ నిర్వాహకులు అందజేశారు.

పూజా కార్యక్రమాల్లో జడ్పీటీసీ, ఎంపీపీ

విశాలాంధ్ర-తాళ్లూరు : మండలంలోని లక్కవరం గ్రామంలో గల శివాలయం నందు కార్తీక చివరి సోమవారం సందర్భంగా ప్రత్యేక యజ్ఞ, పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయ పూజారి, ప్రఖ్యాత యోగి పుంగవులు కృష్ణ స్వామి ఈ సందర్భంగా ప్రత్యేక యజ్ఞ కార్యక్రమాన్ని, పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో జడ్పిటిసి మారం వెంకటరెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, శ్రీ సరస్వతి విద్యాసంస్థల చైర్మన్ ఏవి రమణారెడ్డి, తదితరులు పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్తీక చివరి సోమవారం సందర్భంగా దేవాలయంలో వేలాదిగా భక్తులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించడం విశేషం.

రేపు పశ్చిమ ప్రకాశం యాదవ కార్తీక వనసమారాధన

విశాలాంధ్ర-కొనకనమిట్ల : పశ్చిమ ప్రకాశం యాదవ కార్తీక వన సమారాధన మహోత్సవం రేపు అనగా ఈ నెల 23వ తేదీ బుధవారం పొదిలిలోని శ్రావణి ఎస్టేట్లో జరుగుతుందని అఖిలభారత యాదవ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు మారబోయిన బాబురావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పశ్చిమ ప్రకాశంలోని యాదవ సోదరులందరూ అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారుకోరారు.

ఈ-పంట రసీదులు అందజేత

విశాలాంధ్ర-అర్ధవీడు : ఖరీఫ్ సీజన్లో నమోదైన ఈ పంట రసీదులు మండల వ్యసాయాధికారి షేక్ మహమ్మద్ మండలంలోని బొల్లుపల్లి పంచాయతీ రైతులకు అందజేశారు. బొల్లుపల్లి రై తుభారోసా కేంద్రాన్ని అయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మండలంలోని అన్ని అర్‌బికెలలో సోమవారం నుండీ ఈ పంట ఖరీఫ్ 2022కు సంబంధించిన రసీదులు రైతులకు అందజేస్తున్నామని తెలిపారు. సున్నవడ్డీ పంట రుణాల కు సంబంధించిన జాబితాలను ఆర్‌బికెలలో ప్రదర్శించామని వివరించారు. అర్హులైన రైతుల పేర్లు లేకుంటే వెంటనే బ్యాంక్ వారితో సంతకాలు చేయించి ఆర్‌బికెలో ఇవ్వాలని సూచించారు. పిఎం కిసాన్ ఈకెవైసి, ఎన్‌పిఐసి చేయించుకోని వారి జాబితాలు ఆర్‌బికెలో ఉన్నవని తెలిపారు. వీరు చేయించు కుంటే డబ్బులు జమావుతయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్రి అసిస్టెంట్ అలీ, రైతులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోండి

– ఎమ్మెల్సీ అభ్యర్థి వీరభద్రాచారి విజ్ఞప్తి

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : శాసనమండలి పట్టభద్రుల నియోజక వర్గం నకు జరిగే ఎన్నికల్లోఓటు నమోదుకు ఎన్నికల సంఘం ఇచ్చిన అదనపు అవకాశాన్ని వినియోగించుకోవాలని తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజక వర్గ బహుజన, మేధావి వర్గాల అభ్యర్థి జి. వీరభద్రాచారి విజ్ఞప్తి చేశారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 23 తేదీ నుండి డిసెంబర్ 9 వరకు పట్టభద్రులు తమ ఓటు హక్కు నమోదు కు ఎన్నికల సంఘం మరోసారి ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. బహుజనులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం,మైనారిటీలు విరివిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని బహుజన రాజ్యాధికార సాధనలో భాగస్వామ్యం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు రామాంజనేయులు, ప్రసాద్, మోహనరావు, సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ కుటుంబ సభ్యులను కలిసిన అనంతవరం వాసులు

విశాలాంధ్ర-యద్దనపూడి : మండలంలోని అనంతవరం గ్రామానికి చెందిన ఎన్టీఆర్ కళా పరిషత్ అధ్యక్షులు గుదే పాండురంగారావు ఆధ్వర్యంలో కళాపరిషత్ కమిటీ సభ్యులు ఎన్టీఆర్ మనవరాలైన నందమూరి సుహాసిని కలిసి త్వరలో ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో జరిగే నాటికల పోటీలకు ముఖ్య అతిథిగా ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గుదే తారకరామారావు మద్దినేని జయ రామకృష్ణ పెరవల్లి సాంబశివరావు పెరవల్లి కళ్యాణ్ పోపూరి శివ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి : మోపిదేవి

విశాలాంధ్ర – బాపట్ల : మత్స్యకారుల అభివృద్ధికోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషిచేస్తుందని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ అన్నారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సోమవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలోని డి.ఆర్.సి. సమావేశ మందిరంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో జరిగింది. ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకం కింద లబ్ధిదారులైన మత్స్యకారులకు రాజ్యసభ సభ్యులు వెంకట రమణ, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌లు రూ. 83 లక్షల విలువైన లైవ్ ఫిష్ ట్రాన్స్ పోర్ట్ వెహికల్-1, ఇన్సులేటెడ్ వెహికల్స్-3, మూడు చక్రాల వాహనం -1 పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మోపిదేవి మాట్లాడుతూ మత్స్యసంపదపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారుల బ్రతుకులు ప్రభుత్వం చర్యలతో మారిపోతున్నాయని మత్స్యకారుల అభ్యున్నతికోసం వివిధ కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవతో ప్రతిఏటా మత్స్యకారుల జీవితాల్లో మార్పులు వస్తున్నాయని వివరించారు.

కలెక్టర్‌కు..ధన్యవాదాలు

విశాలాంధ్ర-చీరాల : అవకాశాలు కల్పించే అధికారులు ఉండాలే కానీ చెడుదారిలో నడవకుండా ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు బలహీనవర్గాల ప్రజలు ఎప్పుడు ముందువరుసలో ఉంటారని నిరూపిస్తున్నారు చీరాలకు చెందిన పలువురు మహిళలు. ఇటీవల చీరాల ప్రాంతంలో నాటు సారా కాచి అమ్మకాలు చేపడుతున్న పలువురు మహిళలు, పురుషులను పోలీసు అధికారులు అరెస్ట్ చేసి రిమాండుకు పంపించగా రిమాండ్‌కు వెళ్లి తిరిగివచ్చిన నేరస్తుల ఆర్థిక స్థితిగతులు తెలుసుకున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ చొరవ తీసుకొని వెలుగు అధికారులతో మాట్లాడి వారికి జీవనోపాధి కల్పించేందుకు చొరవ తీసుకోవాలని ఆదేశాలు జారిచేయగా తక్షణమే స్పందించిన వెలుగు ఏపియం సుబ్బారావు గ్రౌండ్ లెవల్లో వారియొక్క స్థితిగతులు తెలుసుకొని వారి జీవనోపాధికి పురుషులకైతే ఆటో, స్త్రీలకు కిరాణా కొట్టు, బట్టల కొట్టు వంటివి ఏర్పాటు చేసుకునేందుకు బ్యాంకు అధికారులతో మాట్లాడి లోన్లు ఇప్పించారు. లోన్లు పొంది షాప్‌లు పెట్టుకున్న పలువురు మహిళలు ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు చేయకుండా తమ భవిష్యత్తును బాగు చేసుకునేందుకు కష్టపడుతున్నారు. జీవనోపాధి లేక మాత్రమే మేము చట్ట వ్యతిరేక చర్యలు చేపట్టమే తప్ప మా వృత్తి అదికాదని మా యొక్క ఆర్థిక స్థితిగతులు తెలుసుకున్న కలెక్టర్ విజయ కృష్ణన్‌కు జీవిత కాలం రుణపడి ఉంటామని పలువురు బాధితులు తెలిపారు. వెలుగు ద్వారా ఆర్థిక సహకారం పొందిన మహిళలు తమ షాపుల ముందు థాంక్యూ కలెక్టర్ అంటు బ్యానర్లు కట్టి తమ కృతజ్ఞతలు తెలుపుతున్నారు. చీరాల మండలంలో జీవనోపాధి లేక తమ కుటుంబాన్ని పోషించుకునేందుకు అసాంఘిక కార్యకలాపాలు చేపట్టి జైలు జీవితం గడిపిన వారి స్థితిగతులు జిల్లా కలెక్టర్ గారు తెలుసుకుని సత్ప్రవర్తన కలిగిన వారికి ఆర్థిక సహకారం అందించాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు తమ వంతు సహకారం అందించామని వెలుగు ఏపిఎం సుబ్బారావు అన్నారు.

చివరి కార్తీక సోమవారంతో కిటకిటలాడిన దేవాలయాలు

- రోజంతా ఉపవాసాలు
- పలు చోట్ల ట్రాఫిక్ మళ్లింపు
- విద్యుద్దీపాలంకరణలతో దేవాలయాలు
- పలు చోట్ల కార్తీక వన భోజనాల ఏర్పాట్లు

పామూరు

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : కార్తీక మాసంలో చివరి సోమవారం కావడంతో శివాలయాలకు భక్త జనం పోటెత్తింది. కార్తీకమాసంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉపవాసాలు ఉండటం, దీపాలు వెలిగించడం హిందూ సంస్కృతిలో ఆనవాయితీగా వస్తుంది. దీంతో కార్తీక మాసం మొత్తం ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించుకుంటారు. ఈ మాసంలో చివరి కార్తీక సోమవారం కావడంతో భక్తులు నదీ స్నానాలకు, శివాలయాలకు ఎక్కువగా వెళ్లారు. దీంతో శివాలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరికొంత మంది సముద్రస్నానాలు, నది స్నానాలు ఆచరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఉపవాసాలు ఉండి మొక్కు బడులు తీర్చుకున్నారు. చివరి కార్తీక సోమవారం కావడంతో జిల్లాలోని ప్రధాన పుణ్యక్షేత్రాల్లో ఉన్న శివాలయాలకు ప్రత్యేక విద్యుద్దీపాలంకరణలు చేశారు. శివాలయాల్లో వెలసివున్న స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు చేశారు. భక్తులు మొక్కుబడులను తీర్చుకునేందుకు వేకువ జామున 4 గంటల నుంచి శివాల యాల వద్ద బారులు తీరారు. భక్తులకు ఎలాంటి ఆటంకం వాటిల్లకుండా ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన ఒంగోలుతో పాటు భైరవకోన, త్రిపురాంతకం, మార్కాపురం చెన్నకేశవస్వామి పలుచోట్ల శివాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మరోపక్క స్వామి మాలలు ధరించిన స్వాములతో పాటు వారి కుటుంబం సభ్యులు తెల్లవారుజామున 4 గంటల నుంచి సముద్ర స్నానాలు చేసి దగ్గరలో ఉన్న శివాలయాల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒకపక్క వాయుగుండం ప్రభావంతో జిల్లాలో వర్షాలు పడుతున్నా వాటిని లెక్కచేయకుండా భక్తులు శివాలయాల వద్దకు పరుగులు తీసి వారి మొక్కులు తీర్చుకున్నారు.

భక్తుల రద్దీ

విశాలాంధ్ర-పామూరు : కార్తీక మాసం చివరి సోమవారం భక్తులతో దేవాలయాలు కిటకిట లాడాయి. చిన్నపాటి వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మోపాడు పంచాయతీలోని శ్రీ గొంది మల్లేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులకు దేవరపు మాల్యాద్రి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాజీ జెడ్పిటిసి బొల్లా మాల్యాద్రి చౌదరి, పచ్చవ చినపేరయ్య, గుత్తి మహేష్, మండ్ల రమణయ్య పాల్గొన్నారు.

ఘనంగా నాయిబ్రాహ్మణ కార్తీక వనభోజనాలు

మాట్లాడుతున్న పిల్లుట్ల సుధాకర్

విశాలాంధ్ర-ఒంగోలు : కార్తీక మాస చివరి సోమవారం శ్రీగిరి కొండ మీద గల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడి వద్ద నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాస వన సమారాధన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సుధాకర్ రావు మాట్లాడుతూ కార్తీక మాసం చివరి సోమవారం రోజు ఈ కార్యక్రమం నిర్వహించుకోవడం మంచి పరిణామమన్నారు. అలాగే సంఘ సభ్యులు అందరూ హాజరై భక్తిశ్రద్ధలతో ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా కార్తీకమాసం వనభోజన కార్యక్రమాలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో సంఘ సభ్యులు అందరూ సంఘ అభివృద్ధికి తోడ్పడాలని సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ నాయి బ్రాహ్మణుల ఎదుగుదలకు తద్వారా చైతన్యవంతులై విద్య ఉపాధి అవకాశాలను, రాజకీయంగా ఉన్న అవకాశాలను సంఘటితంగా ఉండి సాధించుకోవడం ద్వారా నాయి బ్రాహ్మణులు వారి సమస్యలను వారే స్వయంగా పరిష్కరించుకునే స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హస్తకళ డైరెక్టర్ చెరుకూరి జయలక్ష్మి దంపతులను రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ధరణికోట లక్ష్మీనారాయణ సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గుంటూరు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మద్దులూరు శ్రీనివాసులు, మిరియాల రాఘవ, నాదెండ్ల రాఘవ, కొణిజేటి రామకృష్ణ పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన భైరవకోన

విశాలాంధ్ర-సీఎస్‌పురం : జిల్లాలోని ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రమైన, పర్యాటక కేంద్రమైన భైరవకోనలో సోమవారం భక్తులతో కిటకిటలాడింది. కార్తీకమాసం ఆఖరి సోమవారం కావడంతో భక్తులు వివిధ ప్రాంతాల నుంచి వాహనాల్లో భైరవకోన చేరుకొని భైరవకోనలోని జలపాతం, త్రిముఖ దుర్గాంబ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున జలపాతం వద్ద కార్తీకదీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం ఉదయం త్రిముఖ దుర్గాంబ అమ్మవారిని వివిధ పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అర్చక బృందం పంచామృత కుంకుమ అభిషేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో భైరవకోన శివనామస్మరణతో మారుమ్రోగింది. భక్తులకు దేవస్థానం ఆవరణంలో ఉచితంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం చైర్మన్ సిద్ధు రమణారెడ్డి, దేవస్థానం ఈఓ. నర్ర నారాయణరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీ సాయి భారత్ ఉత్తమ జాతీయ సేవా పురస్కారం అందుకున్న శ్రీకాంత్

విశాలాంధ్ర-రాచర్ల : జయ జయ సాయి ట్రస్ట్ అధ్వర్యంలో శ్రీ సాయి భారత్ ఉత్తమ జాతీయ పురస్కారాలు బాపట్ల జిల్లా చిలకలూరిపేటలోని జంపని భాస్కర్ సినీ కళ్యాణమండపంలో పూసపాటి బాలాజీ చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్ గిద్దలూరు నియోజకవర్గంలో గత 8 సంవత్సరాలుగా పేదవారికి పేద విద్యార్థులకు చేస్తున్న సేవా కార్యక్రమాలు గుర్తించిన జయ జయ సాయి ట్రస్ట్ చైర్మెన్ పూసపాటి బాలాజీవారు చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్ సేవకులను గుర్తించిన శ్రీ సాయి భారత్ ఉత్తమ సేవా పురస్కారంను చిలకలూరిపేటలో కార్తీకమాస అన్నసమారాధన కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నరసరావుపేట జిల్లా మేజిస్ట్రేట్ మాబు సుభాని చిలకలూరిపేట ఆర్టీసీ డిఎం రాంబాబు, మనం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చక్రవర్తి, విశ్వజనని సంస్థ చైర్మన్ బొగ్గరపు బ్రహ్మానందం చేతుల మీదుగా చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్‌కు శ్రీ సాయి భారత్ ఉత్తమ జాతీయ సేవా పురస్కారంను అందజేశారు. ఈ కార్యక్రమంలో రంగిశెట్టి రమేష్ రచయిత, లక్ష్మారెడ్డి జనచైతన్య రాష్ట్ర అధ్యక్షులు, డివి సునీత హైదరాబాద్, విశ్వ బ్రాహ్మణ మహిళా అధ్యక్షురాలు కల్లూరి శ్రీవాణి, విశ్వకర్మ పుస్తక రచయిత ఓమగుండ శేషగిరిరావు, గౌరవ పెద్దల చేతుల మీదుగా సన్మానం పొందడం ఆనందంగా ఉందని అలాగే జయ జయ సాయి ట్రస్ట్ చైర్మన్ పూసపాటి బాలాజి గారికి చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మాగులూరి శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలియజేశారు.

రాష్ట్రంలో రౌడీలకు సీఎం జగనే బాసు

జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ ధ్వజం

విశాలాంధ్ర-ఒంగోలు : రాష్ట్రంలో రౌడీలను పెంచి పోషిస్తుంది ముఖ్యమంత్రి జగనేనని, రాష్ట్రంలోని రౌడీలకు జగన్ బాస్ అని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ ధ్వజమెత్తారు. జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో రియాజ్ మీడియాతో మాట్లాడుతూ పచ్చకామెర్లు ఉన్న రోగికి లోకమంతా పచ్చగా కనిపించినట్లు, ఆర్థిక నేరాల్లో ఆరితేరిన జగన్‌కు ప్రజలంతా నేరస్తులుగా, రౌడీలుగా కనిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. మగ్గంపేట ముగ్గురాళ్ల గనుల నుండి జగన్ తాత రాజారెడ్డి నుండి జగన్ వరకు చేసిన నేరాలు సినిమాగా తీస్తే కేజీఎఫ్ సినిమా నుంచి పోతుందని అన్నారు. జగన్ కుటుంబం ఇప్పటివరకు చేసిన రౌడీయిజం, గుండాయిజం, దోపిడీలు, హత్యలు, అవినీతి పనులు సినిమాలుగా తీయాలంటే పది పార్ట్ లు గా సినిమా తీసి పాండ్ ఇండియాలో కాకుండా పాన్ వరల్డ్ లెవెల్లో విడుదల చేయాల్సి ఉంటుందని ఎద్దేవా చేశారు. 32 కేసుల్లో ఏ వన్ ముద్దాయిగా ఉండి 16 నెలల పాటు చర్లపల్లి కూడా జైలులో జైలు జీవితాన్ని అనుభవించిన జగన్ జనసేన పార్టీని రౌడీ సేన అనటం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. మనిషిని చంపి ఇంటికి పార్సిల్ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబు, పార్టీలో అడ్డుగా ఉన్నారని రామకృష్ణారెడ్డిని హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ ఇక్బాల్, విలేఖరి హత్య కేసులో ఉన్న మంత్రి దాడిశెట్టి రాజా, బట్టలు కూడా తీసుకొని ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించే ఎంపీ గోరంట్ల మాధవ్, గంట వచ్చిపో అనే అవంతి, అన్ని చేసిద్దా లేదా అని బేర మాడే అంబటి లాంటి జాతి రత్నాలను పార్టీలో పెట్టుకొని ఉన్న జగన్ జనసేన పార్టీని రౌడీ సేన అనటం సిగ్గుపడాల్సిన విషయం అన్నారు. భవన నిర్మాణ కార్మికుల ఇబ్బందులను రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేసినందుకు, జగనన్న ఇల్లు పేదలకు కన్నీళ్లు పేరుతో వైసిపి నాయకుల స్కాములను బయటపెట్టినందుకా ఈ ఆరోపణలు అంటూ ధ్వజమెత్తారు.